# మినీ కథలు



## తప్పులెన్నువారు

"వచ్చినప్పటి నుంచి చూస్తున్నా ఏమిటీ అదోలా వున్నావు? నీ బాధేమిటో నాకు చెప్పవచ్చుగా. అట్లా నిమ్మకు నీరెత్తివట్టు కూచుని నీట్లోకి రాళ్ళు విసిరితే బాధ పోతుందా?" మైథిలి అంది— సుధాకర్ వేపు చురచుర చూస్తూ.

"..............."

"ఇట్లా మౌనంగా కూచోడానికేనా ఈ చెరువు గట్టుమీద కొచ్చింది. ఆ కొంగలూ. చెరువుకోళ్ళూ చూడు గుంపులు గుంపులుగా చెరువును ఎంత అందంగా అలంకరించాయో."

".... .... ...."

సుధాకర్ ఏమీ మాట్లాడకపోయేసరికి తనే మాట్లాడ్డం సాగించింది.

"మాట్లాడకుంటే మానె కనీసం ప్రకృతి అందానైనా చూడు! కొండవెనక్కి వాలిపోతున్న సూర్యుడు. సన్యాసం తీసుకున్నట్టు కాషాయ వర్ణంలోకి మారిపోతున్న మబ్బులు....ఇంతకుముందు వీటిని చూసి కవిత్వం చెప్పేవాడివి నువ్వు. ఇవాళే మయింది నీకు? సరే నువ్విలాగే వుండు నేను పోతున్నాను" అంటూ లేవబోయింది మైథిలి.

"ప్లీజ్.... నా మనసేం బాగలేదు. ఈ ఒక్కరోజూ...."

"ఏం ఎందుకు బాగలేదు. ఏమయింది నీ మనసుకి? నాతో చెబితే నీమనసు ఎందుకు బాగలేదో చూస్తానుగా. మనసులో బాధ ఇతరులతో చెబితే కుదుటపడుతుందంటారు. నేను దగ్గరదాన్నని నువ్వు అనుకుంటూ వుంటే చెప్పు విషయమేమిటో."

రెండు క్షణాలు మైథిలి కళ్ళలోకి చూసి ఏదో నిశ్చయానికొచ్చినట్టు తల ఆడించి, చెప్పడం ప్రారంభించాడు సుధాకర్.

"ఈ రోజు పొద్దున పోస్టులో మా చెల్లి పేరుతో ఓ ఉత్తరం వచ్చింది. నాకు కొంచెం అనుమానంవచ్చి కవర్ చించి చదివాను. నా మనసు కుత కుత ఉడికిపోయింది. అది విశ్వమూర్తినుంచి వచ్చిన ప్రేమలేఖ. మా చెల్లెలు ఇంటికొస్తూనే అడిగాను. అది నిజం వొప్పుకుంది. ఆ విశ్వమూర్తిగాడు లేంది బతకలేనంది. కోపం పట్టలేక బాగా తన్నాను. ఇంకోసారి ప్రేమా గీమా అన్నావంటే పళ్ళు రాలగొడతా అని బెదిరించి వచ్చాను" సుధాకర్ మొహంలో ఏవగింపు కనబడుతోంది మైథిలికి.

"........" ఈసారి మైథిలి మౌనం.

"ఆడపిల్లలు మరీ దిగజారిపోతున్నారు మైథిలీ! దానికి మహా ఉంటే ఇరవయ్యేళ్ళు లేవు. అప్పుడే ప్రేమట ప్రేమ. అంతా విశ్వమూర్తిగాడే దీని మనసు మార్చేసుంటాడు. రేపు వాడి కీళ్ళిరిచేస్తాను. దొంగ లంజా కొడుకు...." ఖసిఖసిగా తిడుతున్నాడు సుధాకర్.

అందాక మౌనం వహించిన మైథిలి నోరు విప్పింది.

"నాకు ఏభై యేళ్ళనుకున్నావా? నా వయసూ ఇరవయ్యేగా. మరి మన మిద్దరం...."

మైథిలి లేచి చరచరా నడిచి వెళ్ళిపోతోంది. సుధాకర్ గాజు కన్నులతో చూస్తున్నాడు.

—చైత్రాదేవి

---

బస్సూ, రైలూ 'ఢీ' కొన్నాయనీ, రెండూ కాలువలో పడి అంతా చచ్చిపోయారనీ క్షణాలమీద అందరి చెవులకూ అందింది.

ఒకటీ- పదీ- ఇరవై - యాభయి- వంద, వేలు-ఇలా కొన్ని వేల చెవులకు అదే వార్త అందింది.

కలెక్టరుగారు పత్రికా విలేకర్లకు ఫోన్లు చేశారు.

జన సేవా సంఘం ప్రెసిడెంట్‌గారు కార్లు పంపారు.

క్షణాలమీద అంతా రెడీ చేసుకొని బయల్దేరారు.

రేపు—

మెయిన్ హెడ్డింగ్ తమ వార్తే వుంటుందని పత్రికా విలేకర్లు- అంత తొందరగా బ్రహ్మాండమయిన కవరేజ్ ఇచ్చినందుకు ఎడిటర్‌గారు ప్రసంశా లేఖ స్వయాన సొంత దస్తూరీతో రాస్తారని కలలు కంటున్నారు.

పత్రికలో పతాక శీర్షికన వున్న వార్త చూసి జనమంతా వండరైపోతారని- ఎలేకర్లు- ఎవరికి వారే కలల్లో తేలిపోతున్నారు. పవర్‌ఫుల్ వర్డ్స్ కోసం సిగరెట్లమీద సిగరెట్లు కాల్చేసి మరీ ఆలోచిస్తున్నారు.

"స్పీడుగా పోనీయ్."

కలెక్టర్‌గారి కాళ్ళూ, చేతులు ఎక్కడా ఆగట్లేదు- రేపు పత్రికల్లో ఫస్టు పేజీలో వార్త వేయించుకోవాలని ఆయన ఉబలాటం.

"శిధిలాలమధ్య చిక్కుకున్న ప్రమాద బాధితులను ఎంతో సాహసంతో జిల్లా కలెక్టర్ శ్రీ....వెలికి తీశారు.

"....వెలికి తీస్తున్న దృశ్యం."

రేపు ఫస్టు పేజీలో....


ఫస్టు పేజీలో....

కలెక్టరుగారికి ఇలాంటి సదవకాశం ఎప్పుడూ రాలేదు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అయన తెగ తొందర పడిపోతున్నారు.

జనసేవా సంఘం అధ్యక్షులవారు కళ్ళను రెడీగా వుంచుకున్నారు.

"ఈ దృశ్యాన్ని చూస్తున్న జనసేవా సంఘం అధ్యక్షులు శ్రీ.... కనుకొలుకుల్లో నుంచి అశ్రువులు(?) రాలుతూ వుండడం పత్రికా విలేకర్ల కంట పడింది...." అని రేపు ఫస్టు పేజీలో పడబోయే వార్తలో.... అవునవును .... వో పేరా అయినా వుంటుంది.

ఫస్టు పేజీలో ఫొటోలో. తను........!




ఈ దెబ్బతో "ఏ" క్లాస్ పొలిటిషియన్స్‌లో చేరే యెచ్చు- కారు పిచ్చెక్కిన గుర్రంలా పరుగెత్తుతోంది.

* * *

మూడేళ్ళ తరువాత కొడుకు ఇవ్వాళ ఇంటికొస్తున్నాడన్న ఆమె ఆనందం ముక్కచెక్కలైపోయింది.

మూడేళ్ళక్రితం ఇల్లొదిలి వెళ్ళిపోయి, పట్నంలో ఉద్యోగం సంపాదించుకొని—"వస్తున్నా"నని వుత్తరం రాశాడు. తనను చూడడానికి వస్తున్న కొడుకు... లేదు.... లేదు.... అలా జరగడానికి వీల్లేదు....

ఆ ప్రమాదం జరిగిన వార్త అబద్ధం కావాలని కోరుకుంటోందామె.

* * *

ఎలాగైతేనేం కారు ప్రమాద స్థలానికి చేరుకుంది.

ఏమిటీ, ఇక్కడ గుంపులాంటి దేమీ లేదు. పోలీసులూలేరు.

అంతా ఆశ్చర్యంగా వుందే!

గేటు దగ్గరికెళ్ళి గేటు మాన్‌ని అడిగాడో విలేకరి-

"ఇవ్వాళ బండి కరెక్ట్ టైంకే వెళ్ళిపోయింది-"

గేట్ మాన్ ఆశ్చర్యంగా, తీరిగ్గా సమాధానమిచ్చాడు. అందరి ఆశలూ దభేల్‌మని కూలిపోయాయి. కారు వెనక్కు మళ్ళింది. బద్దలైపోతున్న మెదళ్ళనూ, విసుగుతో నిండిన శరీరాల్నీ మోసుకొని—

అబద్ధం అంత బలంగా వ్యాపించదన్న తమ థియరీ తప్పయిన బాధ కంటే ఛాన్సు మిస్సయిన బాధ—

ఇంతలో—

కారాగిపోయింది—

"ఏం జరిగింది?" కలెక్టర్ విసుగ్గా, కోపంతో మండిపడ్డాడు.

"గాలి.... పోయింది...." డ్రైవర్ నసిగాడు.

* * *

తలుపులు నెట్టుకొని లోపలికి వస్తున్న కొడుకునుచూసి, ఆశ్చర్యంతో, సంతోషంతో వుక్కిరి బిక్కిరవుతోంది ముసలావిడ.

# అప్పారావుకి జై

అనుకోకుండా వచ్చిన ఈ ట్రాన్స్‌ఫర్ నాకు చాలా చికాకునే కలిగించింది.

ఎందుకంటే దానివల్ల నేను ఎదుర్కోబోయే యిబ్బందులు చాలా వున్నాయి. హాయిగా స్వంత ఇంట్లో వున్న నాకు ఎక్కడో మరోవూళ్ళో అద్దెకొంపలో వుండడం అన్న విషయం చాలా బాధగానే వుంది. ఊరు మార్పువల్ల పిల్లల చదువులకి యిబ్బంది. కావలసిన వాళ్ళంతా దగ్గరలోనే వుండడంవల్ల అడపాతడపా వాళ్ళను చూడ్డానికి వీలుగా వుండేది. చిన్నచిన్న ఇబ్బందులున్నా ఈ వూళ్ళోనే వుండడం నాకెంతో సదుపాయమైన విషయం.

అందుచేత ఈ వూరినుంచి కదలడం అన్నది నాకుగాని, మా ఆవిడకుగాని ఎంత మాత్రం ఇష్టంలేదు. ఇవన్నీ కావాలంటే బదిలీ కాన్సిల్ కావాలి. దానికి ప్రయత్నాలు మొదలుపెట్టాను. ప్రధమ సోపానంగా సెలవు పెట్టాను.

రాజారావు నాకున్న మంచిస్నేహితుడు. వాడికి ఈ విషయం తెలియడంతో చాలా బాధపడ్డాడు. తప్పకుండా ప్రయత్నం చేద్దాం. హైదరాబాద్ వెళదాం అన్నాడు. నాకు చాలా సంతోషమయింది. ఎందుకంటే ఆ మహానగరం వెళ్ళి ఎవరెవరిని పట్టుకోవాలో అర్థంగాక కొట్టుమిట్టాడుతుంటే రాజారావు తనే ఆ ప్రయత్నం చేస్తాననడం నిజంగా అదృష్టమే. రాజారావు చొరవగల మనిషి, పని చేయించగలడు, అనుకోవడంతో నాకు పని జరిగిపోయినంత సంతోషం కలిగింది.

ఆ మర్నాడే హైదరాబాద్ ప్రయాణం పెట్టుకున్నాం. అక్కడ సమర్పయామి నిమిత్తమై బ్యాంకు నుంచి డబ్బు డ్రా చేశాను. కాని వెళ్ళవలసిన ప్రయాణం ఆ రోజు విచిత్రంగా ఆగిపోయింది.

అదెలా జరిగిందంటే....

ఆ రోజు బాంకు నుంచి నేను, రాజారావు వచ్చేస్తుండగా అప్పారావుగారు కలిశారు. వారేం చేస్తుంటారో నాకు తెలీదుగాని- ఆయన మాత్రం చాలా హంగు, ఆర్భాటంగా వుంటారు.

నాకు ఆయనతో పరిచయం లేదు. రాజారావుకి మంచి పరిచయమే ఉన్నట్టుంది— చనువుగానే మాట్లాడాడు. మాట్లాడుతూ అకస్మాత్తుగా చిన్న కేకలాంటిది పెట్టాడు.